క్లుప్తంగా

వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో విశేషార్చన, నిత్యహోమం, బలిహరణ, సదస్యం, పండితాశీర్వచనం జరిగాయి. ఆలయ అర్చకులు ఎస్ఎల్ఎన్‌బీ శ్రీనివాస్, మురళీకృష్ణమాచార్యుల పర్యవేక్షణలో దేవతామూర్తులను విశేషంగా అలంకరించారు.

99 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

కపిలేశ్వరపురం: మండలంలోని 19 పంచాయతీల పరిధిలో 99 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యింది. మండలంలో 9,990 మందికి వివిధ రకాల పింఛన్లు మంజూరు కాగా ఆదివారం సాయంత్రం నాటికి 9,881 మందికి పింఛన్ల సొమ్ము అందజేసి 99 శాతం పంపిణీ నమోదైంది. సకాలంలో పేదలకు పింఛను డబ్బులను అందజేయడంలో విశేష కృషి చేసిన వలంటీర్లు, సచివాలయ, ఎంపీడీఓ కార్యాలయాల ఉద్యోగులను ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి అభినందించారు.

పీఎంపీ వెంకటేశ్వరరావు మృతి


ఇరవాడ వెంకటేశ్వరరావు

మండపేట: పట్టణానికి చెందిన ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్ (పీఎంపీ) ఇరవాడ వెంకటేశ్వరరావు (86) ఆదివారం కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పీఎంపీగా ఆరు దశాబ్దాల పాటు ఆయన సేవలు అందించారు. వెంకటేశ్వరరావు స్ఫూర్తితో ఆయన కుటుంబ సభ్యులు పది మంది పీఎంపీ వృత్తిలో కొనసాగుతున్నారు. వెంకటేశ్వరరావు మృతికి కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ, పీఎంపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కోన సత్యనారాయణ, సంఘ నాయకులు బల్లా వెంకటరమణ, వానపల్లి కనకరాజు తదితరులు సంతాపం తెలిపారు.

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

మండపేట: ద్వారపూడి రోడ్డు అభివృద్ధిలో భాగంగా చెట్ల తొలగింపు పనుల నిమిత్తం మంగళవారం ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు ఏడీఈ జి తిరుమలరావు తెలిపారు. తాపేశ్వరంలో కొంతభాగం, ఇండస్ట్రియల్ ఏరియా సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో కోరారు.

రాజా మృతికి ఎమ్మెల్యే వేగుళ్ల సంతాపం

మండపేట: డీసీసీబీ మాజీ చైర్మన్, టీడీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల రాజా ఆకస్మిక మృతికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాజా మృతి టీడీపీకి తీరని లోటని, ఆయన కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే వేగుళ్ల ఆదివారం ఒక ప్రకటనలో తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

దాతల ఆశయానికి పాటుపడాలి

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో మూతపడిన పీవీఆర్ హైస్కూల్‌ను తిరిగి తెరవాలని బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మాజీ అమ్మిరాజు డిమాండ్ చేశారు. ఆదివారం పాఠశాల క్రీడా ప్రాంగణంలో అమ్మిరాజు పాఠశాల కోసం స్థలాన్ని విరాళంగా ఇచ్చిన దాతల డాక్యుమెంట్లు ప్రదర్శించారు. దాతల ఆశయాన్ని నిలబెట్టడం కోసం పైండా జమీందార్లు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పెదబాబు, సత్యం కాపు, బండి వీరు, పెద్దరాజు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి చేయూత


సాయం అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

రావులపాలెం: గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న బాలుడికి స్థానిక శ్రీ కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు రూ.12 వేల ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశారు. ఆత్రేయపురం మండలం మెర్లపాలేనికి చెందిన గార్లపాటి సూరిబాబు కుమారుడు పృథ్వీరాజ్‌కు గుండెమార్పిడి శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచించారు. పేదరికంలో ఉన్న ఈ బాలుడి పరిస్థితి తెలుసుకున్న రావులపాలెం కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు సమకూర్చిన నగదును బాలుడికి వైద్య ఖర్చులకు అందజేశారు.

మహిళలకు రాయితీపై వైద్య సేవలు

అంబాజీపేట: ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక స్త్రీల (మిస్సమ్మల), కంటి ఆస్పత్రిలో మహిళలకు ప్రత్యేక రాయితీలపై వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆస్పత్రి సీఈఓ ఎన్.ఆర్.కె.హెవార్డ్‌రాజు చెప్పారు. స్థానిక ఆస్పత్రిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆస్పత్రికి వచ్చే మొదటి 50 మంది మహిళలకు ఒక్క రూపాయికే ఓపీ, అవసరమైన వారికి 100లకే స్కానింగ్, అన్ని రకాల ట్రీట్‌మెంట్‌లపై 25 శాతం తగ్గింపును ఇస్తామన్నారు.

బాలికల బంగారు భవితకు ‘సుకన్య’

- పదేళ్ల లోపు చిన్నారులకు ప్రయోజనం
- పోస్టల్ శాఖ అవగాహన సదస్సులు
- ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు


స్పెషల్ డ్రైవ్‌లో అకౌంట్ తెరిచిన మహిళకు పాస్‌బుక్ అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ దుర్గారాణి (ఫైల్)

మండపేట: బాలికల బంగారు భవితకు సుకన్య సమృద్ధి యోజన బాటలు వేస్తుంది. ఆడపిల్లల ఆర్థిక భద్రత లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకువచ్చింది. ఈ పథకంపై పోస్టల్ శాఖ నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌కు తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వస్తోంది. మండపేట సబ్ పోస్టాఫీసు పరిధిలో గత రెండు నెలల్లో 300 మంది ఈ పథకంలో ఖాతాదారులుగా చేరారు.

బేటీ బచావో.. బేటీ పడావో (ఆడపిల్లను రక్షించు.. ఆడపిల్లను చదివించు) కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో సుకన్య సమృద్ధి యోజన అమలు చేస్తోంది. రామచంద్రపురం సబ్‌డివిజన్ పరిధిలో రామచంద్రపురం హెడ్ పోస్టాఫీసు, 14 సబ్ పోస్టాఫీసులు, 59 బ్రాంచి పోస్టాఫీసులు ఉన్నాయి. ఇప్పటి వరకూ 12,000 వరకు సుకన్య సమృద్ధి ఖాతాలు ఉన్నాయి. బాలికల తల్లిదండ్రులకు ఈ పథకం ప్రయోజనాలు వివరించడం ద్వారా వీలైనంత ఎక్కువ మందిని ఈ పథకంలో చేర్పేందుకు పోస్టల్ శాఖ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోంది. మండపేట సబ్ పోస్టుమాస్టర్ ఎస్.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పోస్టాఫీసు ఉద్యోగులు వార్డులు, కాలనీల్లో సమావేశాలు నిర్వహిస్తూ ఎస్ఎస్‌ఏ పథకం విశిష్టతను వివరిస్తున్నారు. సమావేశాలకు మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, కౌన్సిలర్లు పాల్గొని ప్రజలను చైతన్యవంతం చేస్తున్నారు. పదేళ్ల లోపు ఆడపిల్లలున్న తల్లిదండ్రులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని తమ పిల్లలకు ఆర్థిక భద్రత కల్పించుకోవాలని సూచిస్తున్నారు.

ప్రయోజనాలు

- పదేళ్ల లోపు ఆడపిల్లలు కలిగిన తల్లిదండ్రులు, వారి సంరక్షులు అకౌంట్ ఓపెన్ చేసుకోవచ్చు అకౌంట్ కాల పరిమితి 21 సంవత్సరాలు
- ఏడాదిలో కనిష్ఠంగా రూ.250 నుంచి గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు పొదుపు చేసుకోవచ్చు.
- ఖాతా తెరిచిన తేదీ నుంచి 15 ఏళ్ల వరకూ పొదుపు మొత్తాలు చెల్లిస్తే సరిపోతుంది. 21 ఏళ్ల మెచ్యూరిటీ వరకూ ఖాతాలోని సొమ్ముకు వడ్డీ లభిస్తుంది. ఉదాహరణకు రెండేళ్ల బాలికకు సుకన్య సమృద్ధి ఖాతాలో నెలకు రూ.1000 చొప్పున 15 ఏళ్లకు రూ. 1.8 లక్షలు పొదుపు అవుతుంది. తర్వాత ఆరేళ్లకు మెచ్యూరిటీ అయ్యి 21 ఏళ్ల 7.6 శాతం వడ్డీతో దాదాపు రూ.5.3 లక్షలు తల్లిదండ్రుల చేతికి వస్తుంది.
- అకౌంట్ నుంచి 21 ఏళ్లయిన తర్వాత చేతికి డబ్బులు వస్తాయి. 10వ తరగతి తర్వాత ఉన్నత విద్యకోసం, 18 ఏళ్లు నిండిన తర్వాత అకౌంట్‌లోని 50 శాతం మొత్తాన్ని రుణంగా పొందే వీలుంటుంది.
- మైనార్టీ తీరాక వివాహం కోసం అకౌంట్‌ను క్లోజ్ చేసుకోవచ్చు.

అకౌంట్ తెరిచేందుకు కావాల్సినవి

- బాలిక పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రం
- తల్లి లేదా తండ్రి ఆధార్, పాన్‌కార్డు జిరాక్స్‌లు
- ‘తల్లీ లేదా తండ్రి యొక్క రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు

మంచి స్పందన వస్తోంది



మండపేట పోస్టాఫీసు పరిధిలో 2000 వరకు ఎస్ఎస్ఏ ఖాతాలు ఉన్నాయి. స్పెషల్ డ్రైవ్‌కు మంచి స్పందన వస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో 290 అకౌంట్స్ ఓపెన్ అయితే స్పెషల్ డ్రైవ్‌లో రెండు నెలల్లో 300లకు పైగా అకౌంట్స్ ఓపెన్ అయ్యాయి.

–కొండపల్లి సూర్యనారాయణ, పోస్టల్ అసిస్టెంట్, మండపేట

ఆడపిల్లల తల్లిదండ్రులకు వరం



సుకన్య సమృద్ధి యోజన పాపులర్ పథకాల్లో ఒకటి. ఆడపిల్లలకు ఆర్థిక భరోసా కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ స్కీమును అమలు చేస్తోంది. తల్లిదండ్రులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేందుకు మా వంతు ప్రయత్నం చేస్తున్నాం.

–టపా పుల్లేశ్వరరావు, రిటైర్డ్ పోస్టుమాస్టర్, మండపేట

కల్వర్టు నిర్మాణం పూర్తి చేయాలి


రక్షణ గోడలు లేక ప్రమాదభరితంగా ఉన్న కల్వర్టు

కాజులూరు: మండలంలోని దుగ్గుదుర్రు, ఉప్పుమిల్లి రహదారిలో డ్రెయిన్‌పై ఉన్న కల్వర్టు నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. సుమారు 15 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ కల్వర్టుకు అధికారులు అప్పట్లో ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించకుండా వదిలివేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ కల్వర్టుకు ఇరువైపులా రోడ్డు మలుపు తిరిగి ఉంది. రాత్రి సమయాల్లో వేగంగా వచ్చే వాహనాలు అదుపు తప్పి ప్రమాదాల పాలవుతున్నారు. పలుమార్లు వాహనాలు అదుపుతప్పితే సరాసరి కాలువలోకి జారిపడిపోతాయని ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణానికి రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని స్థానికులు కురవాడ కొండబాబు, కడలి రాంపండు తదితర ప్రజలు కోరుతున్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


మృతుడు నాగిరెడ్డి సత్తిబాబు (ఫైల్)

అయినవిల్లి: మండలంలోని మడుపల్లి సమీపాన రాయుడుపాలెంలో శుక్రవారం సాయంత్రం అదుపుతప్పి ఓ గూడ్స్ వ్యాన్ కాలువలో బోల్తా పడిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ ఘటన ఏడుగురు స్వల్పగాయాలతో బయటపడగా వీరిని 108లో అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మరొకరు కొత్తపేట మండలం వానపల్లికి చెందిన నాగిరెడ్డి సత్తిబాబు (30) గల్లంతయ్యాడు. ఆదివారం అతడి మృతదేహం మండలంలోని కొండుకుదురు, ముమ్మిడివరం మండలం పళ్లవారిపాలెం సరిహద్దులో పంట కాలువ గోడితూములో దొరికింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి అయినవిల్లి పోలీసులు పంచనామా నిర్వహించారు. ముమ్మిడివరం సీహెచ్‌సీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై ఎస్. నాగేశ్వరరావు తెలిపారు.

స్పందించి.. వైద్యం అందించి..


క్షతగాత్రుడిని సమీపంలోని ఆసుత్రికి తీసుకు వెళుతున్న సూర్య ఆసుపత్రి అధినేత ఎంజీఆర్, సిబ్బంది


త్రిమూర్తులుకు ప్రథమ చికిత్స చేస్తున్న ఆస్పత్రి వైద్యులు సురేష్, ధర్మేంద్ర

తాళ్లరేవు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తికి సకాలంలో వైద్య సేవలందించి తాళ్లరేవు సూర్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు నిండు ప్రాణాన్ని కాపాడారు. జాతీయ రహదారి 216లోని తాళ్లరేవు బైపాస్ రోడ్డులో టీ టైం దుకాణం వద్ద ఆదివారం మధ్యాహ్నం బైక్‌పై నుంచి అదుపుతప్పి పడిపోయి కాకినాడ రమణయ్యపేటకు చెందిన గుంటముక్కల త్రిమూర్తులు తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించేందుకు స్థానికులు ప్రయత్నించగా సకాలంలో అంబులెన్స్ రాలేదు. ఈ విషయం తెలుసుకున్న సమీపంలోని సూర్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి అధినేత మచ్చా గంగాధరరావు (ఎంజీఆర్) హుటాహుటిన సంఘటన స్థలానికి సిబ్బందితో పాటు చేరుకున్నారు. రక్తపు మడుగులో ఉన్న త్రిమూర్తులును స్ట్రెచర్‌పై సమీపంలోని ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో అపస్మారక స్థితికి వెళ్లాడని, ప్రథమ చికిత్స చేయడంతో ప్రాణాపాయం తప్పిందని ఆస్పత్రి వైద్యులు ఎం.సురేష్, ధర్మేంద్ర తెలిపారు. క్షతగాత్రుడికి వెంటనే సేవలు అందించిన ఆస్పత్రి నిర్వాహకులను స్థానికులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపేట: మండలంలోని బిళ్లకుర్రు సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ వానపల్లి ఫీడర్ లైన్ మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం పది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ వానపల్లిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ ఆదివారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా పొన్న వాహనోత్సవం

యానాం: యానాంలో కొలువైన భూసమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా 14వ రోజు ఆదివారం రాత్రి పొన్న వాహనోత్సవం వైభవంగా జరిగింది. కాపగంటి సూర్యప్రకాశరావు, ఆయన కుమారులు ఉత్సవదారులుగా నిర్వహించిన పొన్నవాహనానికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, ఆర్‌ఏఓ మునిస్వామి, డీటీ సత్యనారాయణన్, మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ కె.రామకృష్ణ తదితరులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

సైకిల్ తొక్కండి.. ఆరోగ్యాన్ని కాపాడుకోండి


కొత్తపేట సచివాలయం-3 వద్ద నుంచి సైకిల్ ర్యాలీ

కొత్తపేట: సైకిల్ తొక్కండి.. ఆరోగ్యాన్ని కాపాడుకోండి అంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ మండలంలోని అవిడి పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య అభివృద్ధి సంస్థ ఆదేశాల మేరకు అవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి ఇందిరాభారతిరాయి ఆధ్వర్యంలో మండలంలోని సచివాలయాల వద్ద నుంచి సైకిల్ తొక్కండి, ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోండి, ప్రకృతిని కాపాడండి, అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. సైకిల్ తొక్కడం ద్వారా ఒత్తిడి తగ్గుతుందని, గాఢనిద్ర పడుతుందని, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని, గుండె రోగనిరోధక శక్తి పెరుగుతుందని తదితర సంపూర్ణ ఆరోగ్య ఫలితాలు చేకూరుతాయని వివరించారు.

ఉత్సాహంగా గోగులాంబ అమ్మవారి సిరిమానోత్సవం


వెలంపాలెం గోగులమ్మ అమ్మవారికి పుట్టింటి సారె అందిస్తున్న భీమేశ్వరాలయ ఈఓ తారకేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలెం గ్రామ దేవత, ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి సోదరి గోగులాంబ అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నజాతర సందడిగా జరిగింది. సంప్రదాయం ప్రకారం అమ్మవారికి భీమేశ్వరస్వామి ఆలయం నుంచి పుట్టింటి సారెగా పట్టు చీర, పసుపు, కుంకుమ, గాజులు, పుష్పాలు, పళ్లు ఆలయ అర్చకులు, వేద పండితులు, అభిషేక పురోహితులు, చండీహోమం దారులతో కలసి ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి డోలు సన్నాయి మేళాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. సర్పంచ్, రాష్ట్ర ఎడ్యుకేషన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి సుజాత, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు టేకుమూడి సత్యనారాయణ దంపతుల చేతుల మీదుగా అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తుమ్మూరి సుబ్బలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ పలివెల నాగరాజు, ఉప సర్పంచ్ చల్లా బుజ్జి, పెద్దలు రెడ్డి గోపాలరావు, మెరగాని రాజేష్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గోగులాంబ అమ్మవారి ఆలయం వద్ద నేడు పెద్ద జాతర, మంగళవారం సాయంత్రం సిరిమానోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అభివృద్ధి నిధులు వెనక్కి మళ్లడమేంటి?

ఆగ్రహం వ్యక్తం చేసిన పుదుచ్చేరి ఎస్ఈ భాస్కరన్


సమావేశంలో చర్చిస్తున్న పుదుచ్చేరి ఎస్ఈ భాస్కరన్, ఎమ్మెల్యే అశోక్, ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో గత బడ్జెట్‌లో కేటాయించిన కోట్లాది రూపాయల నిధులు పనులు నిర్వహించక వెనక్కి మళ్లడంపై పుదుచ్చేరి పీడబ్ల్యూడీ సూపరింటెండెంట్ ఇంజినీర్ భాస్కరన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక ఆర్‌ఏఓ చాంబర్‌లో సాగు, తాగునీటి ఎద్దడికి తీసుకోవాల్సిన అత్యవసర చర్యలు, పీడబ్ల్యూడీ నిర్మాణాలపై ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్, ఆర్‌ఏఓ మునిస్వామి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ భాస్కరన్ మాట్లాడుతూ అభివృద్ధి నిధులు వెనక్కి మళ్లడమేంటని ఇంజినీర్‌లు భాస్కర్, నాగరాజు తదితరులపై మండిపడ్డారు. ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యానికి చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానికంగా కొందరు నేతలు అభివృద్ధి నిరోధకులుగా మారి ప్రతి పనిని అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ వ్యాఖ్యానించారు. దరియాలతిప్ప ఆయకట్టు పరిధిలోని పంట పొలాలు ఎండిపోయి రైతులు ధర్నాకు దిగడంపై సమావేశంలో చర్చించారు. తక్షణం సాగునీటి ఎద్దడి నివారణతో పాటు ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఇంజినీర్లకు సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సూర్య, చంద్రప్రభ వాహనాలపై ఊరేగిన వెంకన్న


రావులపాలెంలో సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

రావులపాలెం: అలివేలు మంగా పద్మావతి ఆండాళ్ సహిత వేంకటేశ్వరస్వామి 14వ వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు ఆదివారం స్వామికి సూర్య ప్రభ, చంద్రప్రభ వాహనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. తొలుతగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామికి ఉదయాన్నే సుప్రభాత సేవ, సహస్ర నామార్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతం స్వామిని సూర్యప్రభ వాహనంపై గోవిందమాలధారులు పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వాడపల్లి కమలనాథార్యుల ఆధ్వర్యంలో పలు పూజలు జరిపారు. రాత్రికి స్వామికి చంద్రప్రభ వాహనోత్సవం కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఏర్పాట్లను దేవస్థాన పాలక మండలి చైర్మన్ పడాల పెద వెంకటరెడ్డి ఇతర సభ్యులు పర్యవేక్షించారు.

మాంస దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు


కొత్తపేటలో మాంసం దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

కొత్తపేట: మండలంలో మటన్, చికెన్, చేపల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం దాడులు చేశారు. రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్‌బీ బాగ్చి ఆదేశాల మేరకు ఎస్పీ పీవీ రవికుమార్ ఆధ్వర్యంలో విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి చికెన్, మటన్, చేపల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. దానిలో భాగంగా కొత్తపేట టౌన్, మండల పరిధిలో 19 మటన్, చికెన్, చేపల దుకాణాల్లో వివిధ తనిఖీలు జరిపారు. 8 దుకాణాల్లో ఎలక్ట్రానిక్ కాటాలకు స్టాంపింగ్ లేకపోవడాన్ని గుర్తించారు. మొత్తం 9 కేసులు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ రమేష్, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, కానిస్టేబుల్స్ వలీ, కిషోర్, లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు.

రూ.11,600 కోట్ల పుదుచ్చేరి బడ్జెట్‌కు ఆమోదం

యానాం: పుదుచ్చేరి 2023–24 పూర్తిస్థాయి ఆర్థిక సంవత్సరానికి గాను రూ.11,600 కోట్ల బడ్జెట్‌కు ఆదివారం కేంద్ర హోంశాఖ ఆమోదం తెలిపింది. ప్లానింగ్ కమిషన్ రూపొందించిన కేంద్రపాలిత ప్రాంత పుదుచ్చేరి బడ్జెట్ ప్రతిపాదనలకు ముందుగా కేంద్ర హోంశాఖ నుంచి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు వెళ్లడం, దాన్ని వారు ఆమోదం తెలిపాకే అసెంబ్లీలో ప్రవేశపెడతారు. ఈ నెల 9న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతున్నాయి. మొదటి రోజున ఇన్‌ఛార్జి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరాజన్ ప్రసంగించనున్నారు. రెండు రోజుల పాటు గవర్నర్ ప్రసంగంపై చర్చ అనంతరం 13న ఆర్థిక శాఖ సైతం నిర్వహిస్తున్న సీఎం రంగసామి బడ్జెట్‌ను సభలో ప్రవేశపెట్టనున్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

అంబాజీపేట: రోడ్డు నిర్మాణ పనుల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. స్థానిక పెద్దవీధిలో అంబాజీపేట నుంచి బోడసకుర్రు వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. త్వరితగతిన గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు నిర్మాణాలు చేపట్టనున్నామన్నారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, మైలా ఆనందరావు తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

ఘనంగా పుంతలో ముసలమ్మ తీర్థం

ఆలమూరు: గ్రామంలోని పుంతలో ముసలమ్మ అమ్మవారి జాతర, తీర్థం ఘనంగా జరిగాయి. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని కళాకారులు ప్రదర్శించిన గరగ నృత్యాలు, విచిత్ర వేషధారణ, సన్నాయి, బ్యాండ్ మేళాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అమ్మవారి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆదివారం పిండివంటలతో భారీ అన్నసమారాధన జరిగింది.

లక్ష్య సాధన దిశగా..

- గ్రామాల్లో జోరందుకున్న పన్ను వసూళ్లు
- శత శాతం కోసం శ్రమిస్తున్న కార్యదర్శులు
- డివిజన్ పరిధిలో రూ.10.59 కోట్ల వసూళ్లు లక్ష్యం
- ఇప్పటి వరకూ 71 శాతం పూర్తి


పన్ను వసూలు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

రాయవరం: పన్నుల వసూళ్ల లక్ష్యం దిశగా గ్రామ పంచాయతీలు సాగుతున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగింపునకు మరో 26 రోజుల గడువు మాత్రమే ఉంది. దాంతో శత శాతం పన్నుల వసూళ్లకు పంచాయతీల సిబ్బంది శ్రమిస్తున్నారు. ఇప్పటి వరకూ 71 శాతం పైబడి వసూలు చేయగా, మిగిలిన వాటిపై ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామాల్లో ఉదయం నుంచే రసీదు పుస్తకాలు పట్టుకుని ఇంటింటికీ తిరుగుతున్నారు.

క్లస్టర్ పరిధిలో పరిస్థితి ఇదీ

రామచంద్రపురం డివిజన్ పరిధిలో మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం మండలాలు ఉన్నాయి. డివిజన్ పరిధిలో 94 పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీల పరిధిలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి రూ.10,59,04,741 పన్ను వసూళ్లు చేయాలన్నది లక్ష్యంగా ఉంది. ఇందులో గతేడాది బకాయిలు రూ.2,21,42,034 ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి మాసాంతానికి రూ.7,50,61,956 వసూలు చేశారు. వీటిలో పాత బకాయిలు రూ.1,63,83,118 ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.8,37,62,707 డిమాండ్ ఉండగా, ఇప్పటి వరకూ 6,12,76,956 వసూలు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరానికి ఇంకా 2,24,85,751 వసూలు కావాల్సి ఉంది. ఇప్పటి వరకు పాత బకాయిలు, ప్రస్తుత సంవత్సరానికి సంబంధించి 71 శాతం పన్ను వసూళ్లు చేశారు. ఈ నెలాఖరుకు శత శాతం పన్ను వసూళ్లు లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు. అలాగే మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి వసూళ్లే లక్ష్యంగా అధికారులు కృషి చేస్తున్నారు.

రామచంద్రపురం డివిజన్ పరిధిలో పన్ను వసూళ్లు

మండలం	పంచాయతీలు	డిమాండ్ (రూ.)	వసూళ్లు (రూ.)
కపిలేశ్వరపురం	19	1,21,98,754	1,04,99,790
మండపేట	12	4,31,16,459	3,27,67,202
రాయవరం	12	1,94,24,209	1,26,92,168
కె.గంగవరం	26	1,10,81,244	72,03,790
రామచంద్రపురం	25	2,00,84,075	1,18,98,976

కపిలేశ్వరపురం టాప్.. రామచంద్రపురం లాస్ట్

పన్నుల వసూళ్లలో మండపేట నియోజకవర్గంలోని కపిలేశ్వరపురం మండలం 86 శాతం వసూళ్లతో అగ్రస్థానంలో నిలిచింది. అలాగే 59 శాతంతో రామచంద్రపురం మండలం కింది స్థానంలో నిలిచింది. ఆర్థిక సంవత్సరం చివరి నాటికి లక్ష్యాన్ని సాధించే దిశగా పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కృషి చేసేందుకు అధికారులు ప్రణాళికా బద్ధంగా పని చేస్తున్నారు.

నూరు శాతం వసూలుకు కృషి



పంచాయతీల పరిధిలో పన్ను వసూళ్లు ముమ్మరంగా చేపడుతున్నాం. నూరు శాతం పన్ను వసూళ్లు చేసేందుకు కృషి చేస్తున్నాం. మొండి బకాయిలపైనా ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. లక్ష్యాల మేరకు పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిచ్చాం.

– డి.శ్రీనివాసు, ఎంపీడీవో, రాయవరం

ప్రజలు సహకరించాలి



డివిజన్ పరిధిలో వంద శాతం పన్నులు వసూలు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ఆస్తి పన్ను వసూలుకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసి తదనుగుణంగా పనిచేయడంతోనే ఇప్పటి వరకూ రూ.7,50,61,926 వసూలు చేశాం. మరో మూడు వారాల సమయం ఉన్నందున మిగిలిన లక్ష్యాన్ని కచ్చితంగా చేరుకుంటాం. ప్రజలు పన్ను వసూళ్లు చేయడానికి వచ్చే సిబ్బందికి సహకరించాలి.

– ఎం.రామకృష్ణారెడ్డి, డివిజనల్ పంచాయతీ అధికారి, రామచంద్రపురం